# మనస్సే మమత



టి. విజయలక్ష్మి

"మీనం! మీనం! లేగదూడ తల్లిదగ్గరకు వెళ్లటం లేదేం?"

గుంజత్రాడు విప్పి మెడమీద వేసినా, ఉన్నతావు నుంచే కదలటానికి ఉద్యమించని దూడవైపు పరీక్షగా చూస్తూ అన్నాడు రాఘవయ్య.

"దానిక్కూడా ఫేషన్లు తెలుస్తున్నాయేమో! అమ్మా అని ఆప్యాయంగా తల్లిని పిలవడం, ప్రేమగా తల్లి ఒళ్లో తల దాచుకోడం, ఈ రోజుల్లో వెగటుగా మరి! అసలు మన చాదస్తం కానీ, అమ్మానాన్నల అవసరం ఈ రోజుల్లో ఎవరికుందండీ? ఎప్పుడూ తనేమో, తన చదువేమో, తన లోకమేమో గానీ తన మీద అభిమానం చూపే తల్లిదండ్రులంటూ ఒకళ్లున్నారనీ, వాళ్ల ముద్దూ ముచ్చట తీర్చవలసిన బాధ్యత తమకుందనీ కలలో కూడా అనుకోరేమో ఈనాటి పిల్లలు!" మీనాక్షమ్మ గొంతు ఖంగుమంది.

మరొకరైతే ఆమె మాటల్ని మరోలా అర్థం చేసుకుని, ఆవిడ సంతానం తల్లి యెడల నిర్లక్ష్యాన్ని చూపుతోందని భావించేవారేమో గానీ

రాఘవయ్య అలా అనుకోలేదు. ఆయనకు తెలుసు మీనాక్షమ్మ కూతుర్ని తప్పుపట్టే ధోరణిలో అలా మాట్లాడటంలేదనీ, అలా ఎన్నడూ మాట్లాడదనీ, పైపెచ్చు కూతురి చేతలకు పొంగిపోయే మాతృత్వమే ఆమె మాటల్లో ధ్వనిస్తుందనీను.

కన్నులరమూసి, కదిలే ఓపిక లేనట్లు దిగాలుగా నిల్చున్న దూడను రెండు చేతులతోనూ ముందుకు నడిపిస్తూ అన్నాడు రాఘవయ్య "నీదంతా చాదస్తం! దూడ పాలు తాగకపోవడానికీ, లోకంలోని పిల్లల పోకడలకీ పోలికలున్నాయంటావ్! జంతు, మానసికశాస్త్రాల్లో నీకు డాక్టరేట్ ఇప్పిస్తే బావుండు, నోర్మూసుకుని పడివుంటావ్!"

"మీకు వేళాకోళంగానే ఉంటుంది. అసలు ఏ విషయాన్ని లోతుగా ఆలోచించారు గనుక! వయసు పైబడుతున్న ఒక్క కూతుర్నీ ఒక అయ్యచేతిలో పెడ్తే కన్యాదానఫలం దక్కుతుందని నాలుగేండ్లనుంచి చెవిలో ఇల్లుగట్టుకు పోరితే ఆ విషయమేమైనా ఆలోచించారా? పోనీ, పిల్ల పెద్దదైంతర్వాతనైనా పెళ్లి విషయం తలపెడతారేమోనంటే అదీ లేదు. ఉన్న బాధ్యతల గురించి ఆలోచించకపోవడం అటుంచి, అవసరం లేని బరువును నెత్తిన పెట్టుకుంటారదేం ఖర్మమో!"

"బరువేమిటి మీనం?"


"మీనం లేదు, మేషం లేదు! ఈ ఆవు విషయం నేననేది. ఈ ఆవు, దూడ, కావలావాడు, ఆవు సరిగా పాలివ్వడం లేదనీ, దూడ తల్లి దగ్గరకు వరుగెత్తలేదనీ... ఈ పటాటోపమంతా ఎందుకు?"

"నీ కోసమేననుకోరాదూ?"

"ఇదో మెహర్బానీ! బాగా నేర్చుకున్నారు, ప్రతిదీ నీ కోసమేనంటూ."

"కాదని నీవంటే కాకుండాపోతుందా? శరీరంలో వాతం ప్రకోపించి లావెక్కుతున్నావనీ, మాటిమాటికీ నడుము నొప్పికి ఆతిథ్యమిస్తున్నావనీ, వాటి నివారణకు ఆవుపాలు మంచిదనీ కదూ ఇదంతా? అసలు నీ వాతతత్వమే ఈ దూడకుగూడా వస్తోందేమో. అందుకనే మత్తుగా ఉంది ఇవాళ. లేకపోతే పొదుగులోకి మొహాన్ని నెట్టినా పుడిసెడుపాలు కుడిచిందేమో చూడు!" పాలు తాగని దూడను యథాస్థానంలో కట్టివేసి స్నానాల గదివైపు నడిచాడు రాఘవయ్య.

"నా కోసమేం కొనలేదు, మీ ముద్దుల కూతురికీ, మీకూ గేదెపాలు పడటంలేదని కొన్నారు!" ఇంకా ఏదో మాట్లాడబోయిన




మీనాక్షమ్మ అక్కడ భర్త లేకపోవడం గమనించి మిన్నకుండిపోయింది.

మసక వెలుతురు క్రమేపీ అంతర్ధానమౌతుంటే చీకటి చిక్కబడుతోంది. చీకట్లోనే ఆవుదూడను పరిశీలనగా చూసి, రెండు చేతుల్తోనూ దూడ ముట్టెను ప్రేమతో నిమిరి 'పిచ్చిముద్దూ, ఎందుకలా ఉన్నావ్? అజీర్ణం చేసిందా ఏం? కాస్త ఉప్పైనా తిందువుగాని వుండు!' అని లోపలికి పోబోతూ పైకి చూసింది మీనాక్షమ్మ. మేడమీది గదిలో నుంచి దీపం వెలుగు, మంచితనంలా లోకమంతా వ్యాపించాలని కాబోలు, కిటికీలో నుంచి బయటకు దూకుతోంది. కిటికీ దగ్గర్నుంచి ఎవరో లోపలికి వెళ్లిన గుర్తుగా గదిలో నీడ కదలాడింది.

***

"అమ్మడూ, జయం!" జయమ్మ ఉలిక్కిపడింది. చేతిలోని పుస్తకాన్ని మూసి అవతల పెడుతూ వాకిలివైపు చూసింది. మీనాక్షమ్మను చూసి నొసలు చిట్లించింది.

"అన్నం తిందాం, రా తల్లీ!"

"నాకక్కర్లేదు!"

"అక్కర్లేదూ! అదేవిటేవ్, ఎందుకని?" ఆదుర్దాగా అడిగింది.

ఆమె ఆదుర్దాను గమనించిన జయమ్మ చిరాగ్గా అంది "ఆకలిగా లేదులే, వెళ్లు!"

"అదేవిటే కసిరికొడ్తావ్! అన్నం తినమన్నాను గానీ హాలహలం మింగమనలేదుగా!" దీర్ఘం తీసింది మీనాక్షమ్మ.

"నీకు పుణ్యముంటుంది, ఆ హాలాహలం తెచ్చిపెట్టు!" జయమ్మ కళ్లల్లో నీరు నిండింది.

"అయ్యో, అయ్యో! ఇదేం చోద్యమే! ఎవరన్నా వింటే నవ్విపోతారే!" అని కొంచెం ఆగి, కూతురికి దగ్గరగా జరిగి "ఎందుకమ్మా జయం, అలా ఉన్నావు? ఒంట్లో బావుండలేదా?" అంటూ జయమ్మ నుదుట చేయిపెట్టి చూసింది. బుగ్గల్ని తాకి చూసింది. శరీరం-వేడిగా ఉందేమోనని ఆమె భయం.

జయమ్మకు శరీరమంతా తేళ్లూ, జెర్రులూ పాకినట్లుగా ఉంది. కానీ ఆ సంగతి ఎలా చెప్పగలదు? 'నీ స్పర్శే నాకు అస్వస్థత కలిగిస్తోంది. నన్ను ముట్టుకోవద్దు' అని తల్లికి ఎలా చెబుతుంది? అనిష్టమైనదాన్ని భరించనూలేక, తన మనోగతభావాల్ని పైకి చెప్పనూలేక సతమతమైపోతోంది. "అబ్బా...!" అంటూ రెండు చేతుల్తోనూ తల పట్టుకుంది.

"తలనొప్పిగా ఉందిటే! చెప్పవేం మరి... డాక్టర్ని పిలిపించనా?"

వద్దన్నట్లు తల అడ్డంగా ఊపింది జయమ్మ.

"తలనొప్పిగా ఉందని, డాక్టర్ని పిలిపిస్తానంటే వొద్దంటావేమిటే? అంతా నీ ఇష్టమేనా? నా ప్రాణాల్ని తోడేస్తున్నావ్. నిన్నింతవరకూ ఇలా తయారుచేసిన మీ నాన్న ననుకోవాలి. ఊఁ ఒకటే గారాబం. చెప్పినా వినుకోరు!"

అలా ఏదో చెబుతూనే ఉంది మీనాక్షమ్మ.

దీపావళి కథల పోటీలో మొదటి బహుమతి పొందిన ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 25.10.1968 సంచికలో ప్రచురించాము

కానీ జయమ్మ వినిపించుకోవడంలేదు. ఒక విషయంలో నుంచి మరో విషయంలోకి దుముకుతూ ఎడతెరిపి లేకుండా ఏదో మాట్లాడుతూనే ఉంటుంది.

ఆ ప్రవాహానికి తను తట్టుకోలేదు. ఆ ప్రవాహం ఆవిడ నోటంట రాకుండా ఉండాలనే తను ముక్తసరిగా ఒకటిరెండు మాటలు మాట్లాడుతుంది. తను తక్కువ మాట్లాడికూడా ప్రయోజనం లేకపోతోంది. ఏదో ఒకమాట పట్టుకుని 'కీ' ఇచ్చిన అలారంలా వాగేస్తుంది. చివరికి తన తండ్రిమీదుగా ఆ ప్రవాహం ఆగిపోతుంది. ఆయనలో ఏదో తప్పుపట్టడమే ఆమె ధ్యేయమైనట్లు అనిపిస్తుంది. అది తను సహించలేదు!

జయమ్మ మౌనంగా కూర్చోడం మీనాక్షమ్మ వాక్ప్రవాహానికి ఆనకట్ట కట్టినట్లయింది.

"పోనీ, ఇంట్లో ఉన్న మాత్రయినా తెచ్చివేస్తానుండు ఈ పూటకు!" మీనాక్షమ్మ క్రిందికి వెళ్లిపోయింది.

వాన వెలిసినట్లనిపించింది జయమ్మకు.

ఒక ప్రమాదం నుంచి బయటపడి మరో ప్రమాదాన్ని తప్పించుకునేందుకు ప్రయత్నించే ప్రాణిలా తలుపు దగ్గరకు పరుగెత్తి, తలుపు మూసి గడియపెట్టింది జయమ్మ.

వెనక్కు తిరిగిన జయమ్మకు గోడమీద కాలెండరులోని యశోదా, బాలకృష్ణుడూ కనిపించారు. యశోద కూర్చుని చల్లకుండలో నుంచి వెన్నను తీస్తోంది. ఆమె వెనకాల నిల్చుని ఆమె కుడిభుజంపై తన చిరుగడ్డాన్ని ఆనించి వెన్నముద్ద పెట్టమని చేయి జాపుతున్నాడు కృష్ణుడు. యశోద వెన్నను ముద్ద చేయడంలో నిమగ్నమైవుంది. కృష్ణుడికి వెన్న పెట్టకపోలేదు. ఒక ముద్దను ఎడం చేతిలో ఉంచుకున్నాడు. కొంత తిన్నట్లుగా మూతి చెబుతోంది. ఇంకా కావాలని చేయి జాపుతున్నాడు. యశోద ఇంకా పెడుతుందా? తప్పకుండా పెడుతుంది. ఆవిడ మొహంలో ప్రసన్నతే గానీ, విసుగు ఇసుమంత కూడా కనిపించడంలేదు. అదీగాక ఆవిడ పెడుతుందని కృష్ణుడికి బాగా తెలుసు. పెట్టని తల్లి దగ్గర చేయిజాపే అవివేకి కాదు అతను.


'ఎన్ని తింటావోయ్ వెన్నముద్దలు? అజీర్ణం చేయదూ?' అన్నట్లు చూశాయి జయమ్మ కళ్లు. 'యశోద పెట్టేది వెన్నముద్దలు కాదు, ప్రేమామృతాన్ని. అది అజీర్ణం చేయదు!' జయమ్మ మనసు జవాబు చెప్పింది.

మాతృప్రేమామృతాన్ని చవిచూసేందుకు తల్లి దగ్గర చేరడం, ఆవిడ లాలింపుతో పులకించడం, ఇవి కథల్లోనే కనిపిస్తాయా? నిజజీవితంలో పొందలేనివా? లేక తన ఒక్కర్తికీ ఆ అదృష్టం లేదా? తనకు ఊహ తెలిసినప్పటి నుంచీ తను తల్లికి దూరంగా ఉండాలని ప్రయత్నించిందే గాని ఆమెకు చేరువ కావాలని ఎప్పుడూ ప్రయత్నించలేదు. అందుకు కారణం ఏమిటో చాలాకాలం వరకు తనకు బోధపడలేదు. ఇప్పుడు తెలుస్తోంది.

"జయం! జయం!! తలుపు తీయి!" అమ్మ పిలుపు, తలుపుతట్టిన శబ్దం జయమ్మ ఆలోచనల్ని చెదరగొట్టాయి. జయమ్మ లేచి తలుపు తీయలేదు. అలాగే మంచం మీద పడుకుంది. నాన్న కూడా పిలిచాడు. వంతులు వేసుకుని వారిద్దరూ పిలుస్తూనే ఉన్నారు. తలుపు తీయమంటున్నారు. జయమ్మ దిండులో తలదూర్చి కళ్లు మూసుకుంది.

క్రమంగా జయమ్మకు తల్లిదండ్రుల పిలుపులు వినిపించడం మానేశాయి. ఆమెలో తిరిగి ఆలోచనలు మొలకెత్తాయి. తనెందుకు తలుపు తీయలేదు? మాతృత్వం అందించే ప్రేమామృతాన్ని కోరుకునే తను తల్లికి దూరంగా ఉండాలని ఎందుకు కోరుకుంటోంది? ఆ ప్రేమామృతాన్ని చవిచూసే అర్హత తనకున్నా, దాన్ని అందించే శక్తి తల్లిలో లేదనా? కాదు ఆమెలో ఆ శక్తి ఉండవచ్చు. కాని ఆ శక్తికి మించిన మరో శక్తి ఆమెలో ఉంది. ఆ మరో శక్తికి దూరంగా ఉండాలనే తన అభిలాష, ప్రయత్నమూను.

మధ్యాహ్నం సంఘటన అతి జుగుప్సాకరంగా తోచింది తనకు. అది కొత్తగాదు. ఎప్పుడూ అంతే! భోజనాలకి కూర్చున్న సమయంలోనే ఏవేవో సంభాషణలు మొదలెడుతుంది. తెలుగునాట ఏ దంపతులకూ ఏకాభిప్రాయం కుదరదు గాబోలనిపిస్తుంది అమ్మా నాన్నల వాగ్వివాదాలు వింటూంటే. ఎవరో దూరపుచుట్టం కూతురికి పెళ్లి చేస్తున్నట్లు, ఆ పెళ్లికి వెళ్లాలంటుంది అమ్మ. ఎవరోలే పోనిస్తూ అంటాడు నాన్న. దానిమీద అరగంట చర్చ. తను అక్కడ ఉన్నాననే విషయం కూడా మరిచిపోయింది తల్లి. చూసిచూసి విసుగొచ్చింది. అన్నం పెట్టుకున్న పళ్లెం తీసి తల్లి మొహంమీద కొడదామన్నంత కోపం వచ్చింది. ఎన్నోసార్లు తండ్రి చెప్పాడు, అన్నం తినేటప్పుడు అనవసరప్రసంగాలు తేవద్దని. ఆవిడకది బాగా అలవాటైంది. తను ఇక ఓర్చుకోలేక విసురుగా లేచి వచ్చేసింది.



దూరంగా ఫిరంగి వేసిన శబ్దం వినవచ్చింది. అంటే ఎనిమిదైందన్నమాట. పగలు పన్నెండింటికీ, రాత్రి ఎనిమిదింటికీ సమయసూచనగా ఫిరంగి ప్రేలుస్తారు ఈ ఊళ్లో. తనకు ఎనిమిదోఏడు వచ్చేవరకూ ఈ ఫిరంగి మోత అంటే భయంగా ఉండేది. కానీ అంతకంటే భయంగా ఉండేది అమ్మ మాట్లాడుతోందంటే.

మాటకు మాట తోడు లేకపోతే వాచాలత్వం తగ్గిపోతుందని స్కూల్లో టీచరు కాబోలు-ఒకసారి చెప్పింది. ఆ మాట తన మనసులో బాగా నాటుకుంది. అమ్మతో ఏదైనా మాట్లాడితే, ఆమె తన ధోరణిలో 'లొల్లుడు' ప్రారంభిస్తుంది. అది తను భరించలేదు. అందుకని అమ్మతో మాట్లాడటం తగ్గించింది. అది గమనించిన అమ్మ ఒక రోజు అడగనే అడిగింది "ఏమిటే జయం, మాటామంతీ లేకుండా ముంగిలా వుంటున్నావ్? ఏదైనా ఆలోచనలో పడ్డావా, లేక ఏమైనా దిగులు పెట్టుకున్నావా, మీ నాన్న నీ కోసం సంబంధాలు వెదకటం లేదని?"

ఆ మాటలకు తనకు చిరాకు వేసింది. నొసలు చిట్లించుకుని తల్లివైపు తీక్ష్ణంగా చూసింది.

"నీకు వాగటానికి మరో విషయమేం దొరకలేదా ఏం, దాన్ని విమర్శిస్తావ్? అందరి బదులూ నీవు మాట్లాడుతున్నావ్ చాలదూ?" తను అందామన్నా అసలేకపోయిన మాటల్ని నాన్న అన్నాడు. తనకు కొంత ఊరట కలిగింది...

పక్కవాళ్ల గోడ గడియారం గంటలు కొట్టడం మొదలెట్టింది. 'తొమ్మిది' జయమ్మ లెక్కపెట్టింది. ఆ గడియారాన్ని చూసినా, దాన్ని గురించి ఆలోచించినా అమ్మ స్ఫురిస్తుంది. దాని

గంటలే గాకుండా 'టిక్కు టిక్కు'మనే ధ్వని కూడా ఈ ఇంట్లోకి వినిపిస్తుంది. ఎప్పటిదో పూర్వీకుల నాటిది. చూపులకి కూడా పెద్దదిగా, భయంకరంగా కనిపిస్తుంది. ఒకసారి అమ్మకి కోపం వచ్చింది నాన్న ఏదోఅన్నాడని. నాన్న ఇంట్లో వున్నంతసేపూ సణుగుతూనేవుంది. ఆయన ఆఫీసుకు వెళ్లింతర్వాత కూడా ఏదో వంకన ఆయన్ను సాధిస్తూనేవుంది. తను ఆ రోజు ఎందువల్లనో స్కూలుకు వెళ్లలేదు. గదిలో కూర్చుని చదువుకుందామంటే అమ్మ గొడవ ఎక్కువైంది. ఆమె ఆపితే పక్క ఇంటి గడియారం శబ్దం వినిపించేది. ఆ విధంగా ఆ గడియారానికీ, అమ్మకూ పోలిక కుదిరింది.

ప్రక్క ఇంటి సరోజ తనకు పూర్తిగా వ్యతిరేకం. సరోజకు వాళ్ల గడియారమంటే ఎంతో ఇష్టం. వాళ్ల అమ్మకూడా ఎంతో ఇష్టం సరోజకు. ఆ ఇష్టానికి కారణమేమిటంటే చెప్పలేదు. "పదేళ్ల అమ్మాయిని నీ ఇష్టానిష్టాలకు కారణాలు చెప్పలేవా ఏమిటి?" అని తను అడిగితే సరోజకు రోషం వచ్చింది. "మా గడియారం గంటలు కొడుతుంటే సంగీతంలా సుస్వరాలు వినిపిస్తాయిట."

"మరి మీ అమ్మ అంటే ఇష్టం ఎందుకు?" అని అడిగితే సూటిగా జవాబు చెప్పలేకపోయింది. "నీవూ నా తోడిదానివే గదా. అమ్మ అంటే ఇష్టమెందుకో తెలీదా నీకు? మీ ఇంట్లో గడియారం లేకపోయినా అమ్మవుందిగా!" అన్నది. నిజమే అమ్మవుంది. కానీ అమ్మ అంటే తనకి ఇష్టం లేదే, అలాగని తను సరోజతో చెప్పలేకపోయింది.

సరోజ చెప్పలేని విషయాన్ని తను తెలుసుకోగలిగింది. ఆ రోజు జయమ్మ సరోజ వాళ్లింటికి వెళ్లింది. సరోజ వాళ్లమ్మ చాపమీద కూర్చుని స్వెట్టరు కాబోలు అల్లుతోంది. సరోజ అమ్మ ఒళ్లో తలపెట్టి పడుకుని చదువుకుంటోంది. సరోజ తమ్ముడు మోకాళ్లమీద కూర్చొని సరోజ చదువుకుంటున్న పుస్తకంలోని బొమ్మలను చూస్తూ వాటికి వ్యాఖ్యానం చెబుతున్నాడు, తనకంటే చిన్నదైన చెల్లెలికి.

వాడు తక్కున లేచి కూర్చుని "అక్కా! లవకుశల్లో ఎవరు పెద్ద? చెప్పు!" అన్నాడు.

"లవుడేలేవోయ్!" అంది సరోజ నిర్లక్ష్యంగా.

"ఓడిపోయావ్! ఓడిపోయావ్!" అంటూ చప్పట్లు కొట్టాడు వాడు.

సరోజ లేచి కూర్చుంది. "ఎందుకనో చెప్పు!" అంది ఉక్రోషంతో.

"లవుడు ఎంత వయసువాడో, ఏ




రూపువాడో కుశుడు కూడా అంత వయసువాడూ, అదే రూపువాడూను. ఒకసారి లవుడు ఉయ్యాలలో కనిపించలేదని, వాల్మీకి తన మంత్రశక్తితో ఒక దర్భపుల్లను సరిగ్గా లవునిలాంటి పిల్లవాడుగా చేశాడు. నిజానికి లవణ్ని సీత తనతో తీసుకుపోయింది, పూజాపుష్పాలకు అడవిలోకి వెళ్తూ. కళ్లు మూసుకుని తపస్సు చేసుకునే మౌని పిల్లవానికి కాపలా ఏం ఉంటాడు లెమ్మనుకుంది ఆవిడ. పాపం, ఆ విషయం తెలీదాయనకు. తను కళ్లు మూసుకుకూర్చున్నప్పుడు ఏ పులో, మరో జంతువో నోట కరుచుకుపోయిందని భావించాడు. ఆ విషయం సీతమ్మకు తెలియనివ్వకూడదని కుశుణ్ని సృష్టించాడు. అలాంటప్పుడు ఆ ఇద్దరిలో పెద్ద, చిన్నల ప్రసక్తి లేదు."

సరోజ వాళ్లమ్మ అల్లుతున్న స్వెట్టరును అవతల పడేసి కొడుకును బుగ్గలు తడిమి, మెటికలు విరిచి, గుండెలకి హత్తుకుంది. ఉక్రోషమొచ్చిన సరోజను కూడా దగ్గరకి తీసుకుని ముద్దుపెట్టుకుంది. ఇంతలో జయమ్మను చూసి, "రా, జయం!" అంటూ ఆప్యాయంగా పలకరించింది.

ఐదుగురు బిడ్డల తల్లి. ఆ తల్లి మొహంలో ఎప్పుడూ విసుగు, చిరాకు, కోపం చూసి ఎరగదు జయమ్మ. సన్నగా, సౌమ్యంగా మాట్లాడుతుంది. ఆవిడను చూస్తుంటే తను కూడా సరోజకు అక్కగానో, చెల్లెలిగానో పుట్టివుంటే ఎంత బావుండేదో అనిపించింది. ఆ పారవశ్యంలో "అమ్మా!" అని సరోజ వాళ్లమ్మను పిలువబోయింది కూడా. కానీ ఎలాగో నిగ్రహించుకుంది. నయమే, నిజంగా పిల్చాను కాదు. పదకొండేళ్ల పిల్లవు పరాయితల్లిని అమ్మా అని పిల్చావే అని నలుగురూ నాలుగువిధాలా అనేవాళ్లు-ముఖ్యంగా తన తల్లి-అనుకుంది జయమ్మ. తనకే సరోజ వాళ్లమ్మ అంత మంచిదిగా కనిపిస్తే సరోజకు ఆవిడంటే ఎందుకిష్టముండదు?

జయమ్మ పక్కకు ఒత్తిగిలింది. చాలాసేపట్నుంచి ఒకేవైపు పడుకోవడం వల్లనేమో, కుడిచెంప మొద్దుబారి తిమ్మిరెక్కింది. చేత్తో చెంపను రుద్దుకుంటూ కిటికీలో నుంచి చూసింది. ఊరంతా నిద్రపోయింది. చీకట్లోని కీచురాళ్లు ఒకటే రొద చేస్తున్నాయి. చీకటైనా భయంలేదు తనకు. కానీ కీచురాళ్ల అరుపులంటే పరమఅసహ్యం! చెవులు రెండూ వినిపించడం మానేస్తే బావుండునేటంతటి చిరాకు! అమ్మ గొంతులో ఎన్ని కీచురాళ్లున్నాయో ననిపిస్తూంటుంది.

ఒకసారి నాన్న ఏదో పనిమీద తెనాలి వెళ్లివచ్చాడు. ఇంటికి వచ్చేసరికి రాత్రి పదైంది. ఆయన రాగానే అమ్మ అడిగింది "వెళ్లి వచ్చారా?" అని.

"ఎవరింటికి?"

"అదేనండీ, అవధాన్లు గారింటికి!"

"ఏ అవధాన్లు, ఎందుకు?"

"అదేవిటండీ, వాళ్లబ్బాయికి మనమ్మాయిని ఇస్తే బావుంటుందని మొన్న మా పినతల్లి దగ్గర్నుంచి ఉత్తరం రాలా?" దీర్ఘం తీసింది.

"నేనిప్పుడు పెళ్లిసంబంధాలు చూడటానికి వెళ్లేనా, కోర్టు పనిమీద వెళ్లేనా?"

"ఏ పనిమీద వెళ్తేనేం? అన్ని పనులూ చూసుకురాకూడదూ? ఏ పనిమీద వెళ్తే అంతవరకే పూర్తి చేసుకురావాలని శాస్త్రంలో రాసుందా? పిల్లకు పన్నెండేళ్లు నిండుతున్నాయి కదా. ముందునుంచీ కొంచెం తొందరపడి కాస్త మంచి సంబంధం వెదుకుదామనే ఇది ఎందుకుండదు మీకు? అసలు మీకా యావే ఉన్నట్లు కనిపించదేం ఖర్మ. అయ్యో, అయ్యో, అయ్యో! నలుగురూ ఏమైనా అనుకుంటారనే ఇంగితం కూడా లేకపాయె మనిషికి. ఛీ! ఛీ!" అంటూ లోపలికి వెళ్లింది.

"ఇంగితం నీకుందీ? తిరిగి తిరిగి వచ్చిన మొగుణ్ని గడప దగ్గరే ఆపి, ఏదో ముంచుకపోయినట్టు వ్యవహారాలు మాట్లాడకపోతే, కొంచెం నిదానించి, తీరిక చిక్కింతర్వాత అడక్కూడదూ అవన్నీ, నీ ఖర్మగాదు, నా ఖర్మ!" అని తండ్రి నెత్తి బాదుకోవడం పక్కగదిలోని తను చూసింది. చూసి, మనసుకు కష్టంతోచి కళ్లు మూసుకుంది.

ఇప్పుడా సంఘటన జ్ఞాపకమొచ్చి మళ్లీ మనస్సు చివుక్కుమంది. కళ్లు మూసుకుంది. దూరంగా చంటిపిల్లవాని ఏడుపు. ఆ ఏడుపు సగంలోనే ఆగిపోవడం వినిపించింది. మాతృస్తన్యంతో ఏడుపు సగంలోనే విరిగి ఉంటుందని అనుకుంది జయమ్మ.

కిటికీ దగ్గర మనిషి అలికిడి వినిపించింది. జయమ్మ కళ్లు తెరిచి చూసేసరికి అక్కడెవరూ లేరు. బహుశః అమ్మగానీ, నాన్నగానీ వచ్చి ఉండవచ్చు, తనని అన్నానికి పిలవడానికి. తను నిద్రపోతున్నాననుకుని నిద్ర లేపడం ఇష్టంలేక మళ్లీ వెళ్లిపోయారేమోననుకుంది.

తను అన్నం మానేస్తే అమ్మా, నాన్నా ఇంతగా మథనపడిపోతున్నారు. పాపం, ఆవు దూడ పాలు తాగలేదుట. ఆవు తన బిడ్డకు ఆకలి తీరలేదని బాధపడుతోందా? అసలు దూడకేమైంది? జ్వరమా, తలనొప్పా? ఏదైనా మందు ఇవ్వవద్దూ? మందు లేకుండా ఎలా తగ్గుతుంది?

జయమ్మ నవ్వుకుంది. ఏఁవిటీ తన ఆలోచనలు? ఇలాంటి ఆలోచనలు తనకేనా, లేక అందరికీ వస్తూంటాయా? సరోజకేం ఖర్మ? హాయిగా అమ్మతో కబుర్లు చెప్పుకుని నిద్రపోతూ తీయటికలలు కంటూంటుంది. జయమ్మకెందుకో ఏడుపు గొంతువరకూ వచ్చి ఆగిపోయింది.

ఆ రోజు సరోజ తమ్ముడు వచ్చి "నిన్ను మా అక్క అర్జెంటుగా రమ్మంటోంది!" అని చెప్పాడు. తను వెళ్లింది.

వరండాలో సరోజ వాళ్ల అమ్మ కనిపించి తనని చూసి నవ్వింది. తన ఊహాలోని 'అమ్మ' మొహం ఆమెలో కనిపించి క్షణం ఆగి చూస్తూ నిల్చుంది.

"సరోజ లోపల ఉంది. వెళ్లు, జయం!" అంది ఆమె. తను లోపలికి వెళ్లింది.


అక్కడ ఎవరో కూర్చుని పుస్తకం చదువుతోంది. "సరోజ ఎక్కడ?" అని తను అడిగింది.

జవాబుగా గలగలమని నవ్వుతూ కూర్చున్న

## కాజోల్‌పై శ్రీదేవి ప్రయోగం

బోనీకపూర్‌ను పెళ్లాడి పాపకు జన్మనిచ్చిన శ్రీదేవి ఇప్పుడు నిర్మాత కాబోతోంది. శ్రీదేవి మళ్లీ హీరోయిన్‌గా నటిస్తుందని ఆమె భర్త బోనీకపూర్ ప్రకటించినప్పటికీ ఈ నిర్ణయాన్ని కొన్నాళ్లపాటు వాయిదా వేసుకున్నారు. పేలని టపాకాయలా తుస్సుమన్న 'అంతఃపురం' చిత్రాన్ని శ్రీదేవి హిందీలో నిర్మిస్తున్నారు. ఇందులో ఓ ప్రముఖపాత్రలో అజయ్‌దేవగన్ భార్య కాజోల్ నటించనుంది. ఈ చిత్రం ద్వారా పెళ్లి చేసుకున్న కాజోల్‌ను మళ్లీ తెరమీదకు తీసుకొచ్చాక ఆమెకు ప్రేక్షకుల నుంచి లభించే స్పందనను బేరీజు వేసుకుంటుందట శ్రీ. అప్పుడిహను తాను హీరోయిన్‌గా నటించాలా, వద్దా అని తేల్చుకుంటుందట. నువ్వు చేస్తే ఏమనుకుంటారోనని ఇతరులమీదిలా ప్రయోగం చేయడం భావ్యమా, శ్రీదేవీ?

**007**



ఆ వ్యక్తి లేచి తన దగ్గరకు వచ్చింది. తను పోల్చుకోలేదు ఆమే సరోజ అని. అరే! ఏమిటి ఈ మార్పు?

తను ఆశ్చర్యంలోనుంచి తేరుకోకముందే సరోజ అడిగింది "జయం! ఎలా ఉన్నాను, నేను చీర కట్టుకుంటే? మా అమ్మ పట్టుచీర ఇది. దీని ఖరీదెంతో తెలుసా?"

తనకా వివరాలన్నీ అక్కర్లేకపోయాయి. తను అడిగిందల్లా ఒక్కటే "నీవీ చీర ఎందుకు కట్టుకున్నావ్?"

"ఎందుకేమిటి, మా అమ్మ కట్టుకోమంది. లేదూ, కట్టింది!"

"ఎందుకు?"

"నీ ప్రశ్నలకు జవాబులు చెప్పలేను, బాబూ!" అని బుంగమూతి పెట్టి, "చీర కట్టుకోవడమే కాదు, ఇంకా ఇలాంటివెన్నో నేర్చుకోవాలిట-మా అమ్మ చెప్పింది!" అన్నది.

ఇంతలో సరోజ వాళ్లమ్మ వచ్చి "నీవు కూడా ఓసారి చీర కట్టుకోరాదూ?" అన్నది నవ్వుతూ.

"నాకెందుకూ?" తనకేమో లేనట్టు మనసులో వెలితి ఏర్పడింది.

"మంచిదానివి, పద్నాలుగో ఏడు వస్తోంది కదా, రేపో మాపో పెద్దమనిషివవుతావ్! ఎందుకంటావేమిటి?" అన్నదామె.

తను వెంటనే ఇంటికి వచ్చేసింది, వాళ్లు పిలుస్తున్నా వినిపించుకోకుండా.

ఎంతసేపటికీ తనకు పెళ్లి, సంబంధం చూడటం-ఇలాంటి విషయాలే అమ్మ, నాన్నతో మాట్లాడుతుంది. సరోజ వాళ్లమ్మలాగా తనకి చీర కట్టుకోవడంలాంటి విషయాలెప్పుడూ చెప్పదు. సరోజ వాళ్లమ్మ సరోజ పెళ్లిని గురించి ఎప్పుడూ మాట్లాడినట్టు లేదు. పైగా, వింతవింత కబుర్లూ, విశేషాలూ ఎప్పుడూ చెబుతూంటుంది ఆసక్తిగా. ఏఁవిటీ తేడా ఈ అమ్మకూ, ఆ అమ్మకూ?

సరోజ వాళ్లమ్మ ఎప్పుడూ పుస్తకాలు చదువుతూంటుంది. అమ్మ ఎప్పుడైనా చదివితే వచనభాగవతం చదువుతుంది. అందుకని, సరోజ వాళ్లమ్మకు కొత్తకొత్త విషయాలు తెలుస్తూంటాయేమో. వాటిని సరోజకు చెబుతూంటుంది. మరి తనూ పుస్తకాలు చదివి తెలుసుకోవచ్చుగా? ఈ ఆలోచన బాగా ఉందనిపించింది జయమ్మకు. చక్కటి ఆలోచన వచ్చినందుకు తనను తానే అభినందించుకుంది.

చదివినకొద్దీ ఇంకా చదవనాలనే తృష్ణ బయలుదేరింది జయమ్మలో. ఎన్నో పుస్తకాల్లో తల్లీబిడ్డల అనుబంధాన్ని గురించీ, ప్రేమానురాగాల్ని గురించీ చదివింది. ఆ రచనలు ఆమెలో తల్లీబిడ్డల బాంధవ్యాన్ని గురించి కొన్ని దృఢమైన అభిప్రాయాలను కలిగించాయి. నిజజీవితానికీ, సాహిత్యానికీ ఉండే తారతమ్యాలూ, సారూప్యాలూ బోధపడ్డాయి.

జయమ్మ ఆవులించింది. మనసు అలసిపోయింది. నిద్రాదేవి ఒడిలోకి జారిపోయింది.

ఇంతలో "అంబా!" అనే శబ్దం వినిపించింది.

జయమ్మ లేచి కూర్చుంది. పాలు తాగని ఆవు దూడ గుర్తుకొచ్చింది. పాపం, దానికెలా ఉందో? ఆవు అరుపు వినిపించిందిప్పుడు. ఆవు ఎందుకు అరిచింది? దూడకేమీ కాలేదు కదా! పాపం, ఆ దూడంటే ఆవుకు ఎంత ప్రేమో! దూడ శరీరమంతా నాలుకతో తడుపుతుంది ఆవు. నోరులేని జంతువులు ప్రేమను వ్యక్తంచేసే చేష్ట అదేగా! తల్లి ప్రేమవాహినిలో మునిగితేలడం ఎంత అదృష్టం! ఆ అదృష్టం తనకు లేదు. ఆవు

దూడకుంది. సరోజకూ ఉంది. "నీ మీద మీ అమ్మకు ప్రేమ లేదనుకున్నావా?" అని ఎవరో అడిగినట్లయింది తనను. ఆ ప్రశ్న తనూ చాలాసార్లు వేసుకుంది. కానీ, ప్రేమ ఉన్నదా, లేదా అని కాదు తనకు కావలసింది. ఆ ప్రేమ సరైన మార్గంలో తనకు నచ్చేవిధంగా ప్రదర్శితమవుతోందా, లేదా అని. నోరులేని జంతువులపాటి ప్రేమప్రకటన అమ్మ ఎందుకు చేయలేకపోతోంది?

జయమ్మ మంచం దిగి నిల్చుంది. అన్నం తినకపోవడం వల్లనేమో ఒళ్లు తూలింది. గోడను పట్టుకుని నిలద్రొక్కుకుంది. అక్కడే ఉన్న కూజాలోని మంచినీళ్లు రెండు గుక్కలు తాగి క్రిందకు దిగింది. దూడను ఆవు దగ్గరకి తీసుకువెళ్లి వదలిరావాలనీ, దూడ తల్లి దగ్గర పాలు తాగుతుంటే ఆ రెండు జంతువుల హావభావప్రకటనను చూడాలనుకుంది.

ఆవు దూడ వెల్లకిలా పడుకుని ఉంది. కదలిక కనిపించలేదు దానిలో. దూడకు దగ్గరగా పోయింది. చీకట్లో తను చూడనేలేదు, దూడ నీళ్లు తాగటానికని అక్కడ పెట్టి ఉన్న దబరా గిన్నె తన కాలికి తగిలి శబ్దం చేస్తూ దొర్లింది. గిన్నెలో మిగిలిఉన్న కాసినినీళ్లూ నేలమీద మడుగుకట్టాయి.

ఆ ధ్వనికి ఇంట్లోనుండి రాఘవయ్యా, మీనాక్షమ్మా హడావుడిగా బయటికి వచ్చారు. "ఎవరూ, జయం! నువ్వా?" అంటూ, రాఘవయ్య లైటు వేశాడు.

"ఏమిటి తల్లీ, ఇంత రాత్రప్పుడు ఒక్కర్తెవూ క్రిందికి దిగివచ్చావుటే! ఏం చేస్తున్నావిక్కడ? తలనొప్పి తగ్గిందా? ఒంట్లో ఎలా ఉంది. ఏదీ, ఇలా రా చూస్తాను!"

మీనాక్షమ్మ మాటలు పూర్తి కానేలేదు. కెవ్వుమని కేక వేసి జయమ్మ మేడపైకి పరుగెత్తింది. చివరిమెట్టు ఎక్కుతూనే కుప్పలా కూలిపోయింది.

రాఘవయ్యా, మీనాక్షమ్మా గుండెలు బాదుకుంటూ, శోకాలు పెడుతూ పైకి చేరారు. ఆ గోలకు ఆవు బెదిరిందేమో, గాడిచుట్టూ తిరగసాగింది.

***

తెల్లవారింది. తెల్లవార్లూ రాఘవయ్యా, మీనాక్షమ్మా, డాక్టరూ-కన్ను మూయలేదు, జయమ్మ కన్ను తెరవనూ లేదు.

బారెడు పొద్దెక్కినా ఆవును గురించీ, దాని మేత, నీటి గురించీ ఎవ్వరూ అనుకోలేదు. ఆవు దూడను గురించి ఎవరూ అనుకోవలసిన అవసరం లేకపోయింది. మరి కాసేపటికి ఆవుదూడను ఎవరో తీసుకువెళ్లారు. ఆవు చూస్తూ నిల్చుంది. అంతా అయిన తర్వాత కాసేపు అటూఇటూ పిచ్చిగా తిరిగింది.

పొద్దు తిరిగేసరికి జయమ్మకు జ్వరం జారింది. కళ్లు తెరిచింది. ఆ కళ్లల్లో ఇదివరకటి వెలుగు లేదు. పిచ్చిగా చూస్తోంది. భీతితో వణుకుతోంది. దిగులుగా కూర్చుంటుంది, పిలిచినా పలకదు. పలికినా తన భాష మరచిపోయినట్లు అర్థంలేని మాటలు. ఎప్పుడూ మేడమీది గదిలో కిటికీ దగ్గర కూర్చుని క్రిందకు చూస్తుంది. నెమరువేస్తూ పడుకున్న ఆవును చూసి నిట్టూరుస్తుంది.

అలా ఎన్నాళ్లు కూర్చుందో!

***

ఇది జరిగి ఎన్నాళ్లో అయింది.

పురిటికి పుట్టింటికి వచ్చింది సరోజ. మనవడి కోసం వూలుతో స్వెట్టర్ అల్లుతోంది సరోజ వాళ్లమ్మ.

ఉన్నట్టుండి ఏదో గుర్తుకువచ్చినదానిలా అడిగింది సరోజ "అమ్మా! జయమ్మ ఎలా ఉందమ్మా?"

"జయమ్మకేమే, నిక్షేపంలా ఉంది. సాహితీలోకాన్ని ఊపేస్తోందనుకో! ఆమె కథగానీ, సీరియల్‌గానీ, గేయంగానీ, నాటికగానీ లేకుండా ఏ పత్రికా రావడం లేదంటే నమ్ము!. అమ్మాయ్ సరూ! తల్లి ప్రేమ ఎలా ఉండాలో, పిల్లల పెంపకం ఎలా ఉండాలో నీవు తెలుసుకోవాలంటే జయమ్మ రాసిన నవలలు చదివి తీరాల్సిందే!"

"అయితే... అమ్మా! జయ అనే పేరుతో..."

"జయమ్మే రాస్తోంట."

సరోజ సంతోషం పట్టలేకపోయింది. చిన్ననాటి స్నేహితురాల్ని ఎప్పుడు చూద్దామా అనే తహతహతో జయమ్మగారింటికి వెళ్లింది.

"ఎవరూ?" అంది పుస్తకం చదువుకుంటున్న జయమ్మ, సరోజను చూస్తూనే.

"నేను, జయం! సరోజని" అన్నది ఆనందంతో సరోజ.

"ఓ... నువ్వా?" అంటూ తిరిగి పుస్తకం తెరిచింది జయమ్మ, నిర్లిప్తంగా.

■

## మాది మంచి స్నేహం మాత్రమే!

**త**బ్బూ ఈ మధ్య హన్సల్‌మెహతా అనే దర్శకుడి ప్రేమలో పడిందని బాలీవుడ్‌లో పుకార్లు లేచాయి. ఇదే విషయాన్ని ఆమె దగ్గర ప్రస్తావిస్తే "అసలీ సంబంధాలు ఎవరు, ఎందుకు అంటగడతారో నాకేమీ అర్థం కావడంలేదు" అని కోపంగా చెప్పింది. అసలు విషయమేమిటంటే లండన్ నుంచి ఇండియాకు వస్తున్న ఒక ఫ్రెండ్‌ను రిసీవ్ చేసుకోవడానికి తబ్బూ ఈ మధ్య ముంబయి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లింది. ఆ రోజున లండన్ నుంచి వస్తున్న విమానం బాగా ఆలస్యమైంది. తబ్బూ ఎదురుచూస్తున్న ఫ్లయిట్‌లోనే హన్సల్‌మెహతా బంధువు కూడా ఒకాయన వస్తున్నాడు. ఒకవైపు ఫ్లయిట్ లేటు... మరోవైపు తబ్బూ. సరే, ఇద్దరూ విమానాశ్రయంలోని ఓ లాంజ్‌లో బాతాఖానీ మొదలుపెట్టారు. ఇది ఫ్లైట్ వచ్చే వరకూ అంటే రెండున్నర గంటలపాటు సాగింది. వీళ్లిద్దరూ అంతసేపు మాట్లాడుకోవటం చూసిన ఎయిర్‌పోర్ట్ జనం "వీళ్లిద్దరూ పెళ్లి చేసుకుంటున్నారేమో!" అని గుసగుసలు వ్యాపింపజేసేశారు. ఎయిర్‌పోర్ట్‌లో తాను అంతసేపు మాట్లాడటమే చేసిన తప్పనీ, హన్సల్‌తో ప్రేమ వచ్చి అబద్ధమనీ, తాను ఎదురుచూస్తున్న గ్రీకువీరుడు ఇంకా తన కళ్ల ముందుకు రాలేదనీ వాపోతోంది తబ్బూ. తబ్బూను ప్రేమిస్తున్న హీరోలూ, వింటున్నారా?

**007**

